క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అల్లవరం: గోడిలోని బాలుర గురుకులంలో ఆరు నుంచి తొమ్మిది తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 25న విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు 83318 82301, 85010 04035 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

హాస్టళ్లలో దోమల నిర్మూలనకు చర్యలు

అమలాపురం టౌన్: ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఈడబ్ల్యూఎల్ కాలనీలో ఉన్న అర్బన్ ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలోని బాలుర, బాలికల వసతి గృహాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు శుక్రవారం చేపట్టారు. వసతి గృహాలు, వాటి పరిసరాలు, ఆయా గృహాల గదుల్లో దోమల నివారణకు మలాథియన్ మందును పిచికారీ చేశారు. ఈ చర్యల వల్ల వసతి గృహాల విద్యార్థులు దోమకాట్లకు గురికాకుండా ఉంటారని అర్బన్ ఆరోగ్య కేంద్రం సబ్‌యూనిట్ ఆఫీసర్లు సత్యనారాయణ, ఆదినారాయణ తెలిపారు.

30లోపు వడ్డీ లేకుండా పన్నులు చెల్లించాలి

– మున్సిపల్ కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్: మున్సిపాలిటీ పరిధిలో 2024–25 తొలి అర్థ సంవత్సరానికి ఇంటి, ఖాళీ స్థలం, కుళాయి పన్నులను వడ్డీ లేకుండా ఈ నెల 30లోపు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ విజ్ఞప్తి చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కమిషనర్ ఈ అంశంపై చర్చించారు. గడువును సద్వినియోగం చేసుకోని పన్నుల చెల్లింపుదారులు జూలై ఒకటో తేదీ నుంచి ఆస్తి పన్నుకు రెండు శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారి శిరిగినీడి శివాజీ పాల్గొన్నారు.

హెవీ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అమలాపురం డిపోలో హెవీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా త్వరలో జరిగే తొమ్మిదో బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. 21 ఏళ్లు నిండి, లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, డ్రైవింగ్‌లో ఓ ఏడాది అనుభవం ఉన్నవారు ఈ శిక్షణకు అర్హులని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు రజాక్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్‌ను 73829 09588 నంబరులో సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

డిగ్రీ కాలేజి ఏర్పాటుకు వినతి

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని శుక్రవారం రాజమహేంద్రవరం ఉన్నత విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎస్.శోభారాణికి పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు వినతిపత్రం అందించారు. ఐదేళ్ల క్రితం వరకు ఎయిడెడ్ కళాశాలగా ఉన్న ఎస్‌కేబీఆర్ కాలేజీకి గత ప్రభుత్వం ఎయిడెడ్ వ్యవస్థను రద్దు చేయడంతో ప్రైవేట్ కళాశాలగా యాజమాన్యం నడుపుతోందని చెప్పారు. దీని వల్ల పేద విద్యార్థులు ఫీజులు కట్టే ఆర్థిక స్తోమత లేక చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని విద్యా శాఖ ఉన్నతాధికారులు, అమలాపురం ప్రాంత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, కాలేజీ ఏర్పాటయ్యేలా కృషి చేస్తామని ఆర్జేడీ శోభారాణి హామీ ఇచ్చారు.

శివాజీ సౌర్య స్ఫూర్తి పోటీలు

అమలాపురం రూరల్: ఛత్రపతి శివాజీ మహరాజ్ 350వ సామ్రాజ్య పట్టాభిషేక సంవత్సరాన్ని పురస్కరించుకుని సంస్కార భారతి అంబేడ్కర్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి శివాజీ సౌర్య స్ఫూర్తి పోటీలు నిర్వహిస్తున్నట్టు డాక్టర్లు గోదశి గంగరాజు, కొప్పనీడి వెంకటరమణకుమార్, సంస్కార భారతి ప్రాంత ప్రముఖ్ వి.సాయిలక్ష్మి తెలిపారు. పాఠశాలల్లో జూలై 5లోగా అంతర్గత స్థాయిలో వ్యాస రచన, చిత్రలేఖన, ఏక పాత్రాభినయం, లఘు నాటక పోటీలు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఉంటాయన్నారు.

ఉపాధి కూలీ మృతి

అమలాపురం రూరల్: తాండవపల్లి గ్రామంలో మన్నానగర్ కాలనీకి చెందిన ఉపాధి కూలీ కందికట్ల పల్లంరాజు(55) మృతిచెందారు. శుక్రవారం ఉపాధి పనికి వెళ్లి, ఆకస్మికంగా మరణించాడు. అతడి కుటుంబానికి ప్రభుత్వం రూ.పది లక్షల పరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

కామిశెట్టి సావిత్రికి నివాళులు

యానాం: ఫ్రెంచి వారి పాలన నుంచి యానాం విముక్తి కోసం పోరాడిన స్వాతంత్ర్య సమర యోధురాలు, పాండిచ్చేరి రాష్ట్ర ఏర్పాటు కమిటీ సభ్యురాలు దివంగత కామిశెట్టి సావిత్రి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. రాజీవ్ రివర్ బీచ్ వద్ద ఆమె విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు నివాళులర్పించారు.

మిషన్ శక్తి సదస్సులు

యానాం: యానాం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మిషన్ శక్తి బృందం శుక్రవారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. స్థానిక ప్రభుత్వ ఐటీఐ, సామాన్య ఆస్పత్రి ప్రాంతాల్లో సదస్సులు జరిగాయి.

సర్కారు బడి పిలుస్తోంది

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- నూతన అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి
- ప్రైవేట్ సంస్థల తరహాలోనే ప్రచారం
- ఇంటింటా తిరుగుతున్న ఉపాధ్యాయులు



బడి బయట పిల్లలను గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

తాళ్లరేవు: కార్పొరేట్ స్కూళ్ల తరహాలోనే ప్రభుత్వ పాఠశాలలు ముస్తాబై విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. గత ప్రభుత్వం నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించడంతో, ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యా శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలు చేస్తున్న తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో సైతం విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రైమరీ స్థాయిలో మండల స్థాయి కమిటీలను వేసి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. బడి బయట పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరుస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న అనేక పథకాలను వివరించడంతో పాటు, గత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాలను ప్రచారాస్త్రాలుగా మలచుకుంటున్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మెరిట్ విద్యార్థుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఆయా పాఠశాలల వద్ద ఏర్పాటు చేసి, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. విద్యా శాఖ సిబ్బంది స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, గత ఫలితాలను చూపించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. గతంలో ప్రతిష్ఠాత్మక ట్రిపుల్ ఐటీల్లో సాధించిన సీట్లు, నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థుల వివరాలను తెలియజేస్తున్నారు. ఉపాధ్యాయ బృందం చేస్తున్న ఈ ప్రచారం ఉత్తమ ఫలితాలను ఇస్తోందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

ఉత్సాహంగా నేను బడికి పోతా..

బడి బయట ఉన్న 6 నుంచి 14 ఏళ్ల పిల్లలను స్కూళ్లలో చేర్పించే ఉద్దేశంతో ప్రభుత్వం నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. విద్యా శాఖ సిబ్బందితో పాటు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, బడిలో చేర్పించే కార్యక్రమాన్ని చురుగ్గా నిర్వహిస్తున్నారు.

సకల సదుపాయాలు



ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో పాటు, అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. ఒత్తిడి లేని నాణ్యమైన విద్యను అందిస్తూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నాం. ఆయా అంశాలను హెచ్‌ఎంల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం చేసి తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నారు. ఇది సత్ఫలితాలనిస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 594 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.

– మోకా ఉమ, ఎంఈఓ–2, తాళ్లరేవు మండలం.

పాఠశాలల్లో ప్రగతిని వివరిస్తున్నాం



ప్రభుత్వాలు విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ, పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయి. వాటి ద్వారా తాము సాధిస్తున్న ప్రగతిని ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేలా చర్యలు చేపడుతున్నాం.

– ఎస్వీ రమణకుమార్, హెచ్‌ఎం, మాధవరాయునిపేట, తాళ్లరేవు

బడి బయట పిల్లలను గుర్తిస్తున్నాం



పలు కారణాలతో బడికి వెళ్లకుండా ఇంటి వద్ద ఉండే పిల్లలను గుర్తించి, వారు పాఠశాలల్లో చేరేవిధంగా ఇంటింటి సర్వే చేస్తున్నాం. తీర ప్రాంత గ్రామాలున్న తాళ్లరేవు మండలంలో చదువుపై అవగాహన లేక అనేక మంది తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం లేదు. అటువంటి వారిని గుర్తించి, పాఠశాలలలో చేరుస్తున్నాం.

– టి.మీరాసాహెబ్, సీఆర్పీ

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఫౌండేషన్ కన్వీనర్ నడింపల్లి రామరాజు

అమలాపురం రూరల్: ఏడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, అమెరికా ఆధ్వర్యంలో ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో శుక్రవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వన్నెచింతలపూడి గ్రామంలో క్షత్రియ సేవా సమితి హాల్‌లో బసవ తారకం హాస్పిటల్ మొబైల్ వాహనం ఏర్పాటు చేసి, ఆధునిక వైద్యులతో పరీక్షలు నిర్వహించారు. అనేక సమస్యలతో బాధపడుతున్న మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. గ్లోబల్ ఫౌండేషన్ కన్వీనర్ నడింపల్లి రామరాజు మాట్లాడుతూ గ్రామంలో అందరూ ఎటువంటి అనారోగ్యంతో బాధపడకుండా తమ సంస్థ గ్రామస్తులకు అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కా రాజారత్న నాగవాణి, లయన్స్ జోన్ చైర్‌పర్సన్ జంపన సుమన్‌వర్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య యోగం

- ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం
- పలు సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు

అమలాపురం టౌన్: యోగా అంటే అదో ఆరోగ్య యోగం, యోగాసనాల్లో అనేక అనారోగ్యాలను నయం చేసే వైద్య సూత్రాలు దాగి ఉన్నాయని అమలాపురంలో శుక్రవారం జరిగిన ప్రపంచ యోగా దినోత్సవ వేడుకల్లో పలువురు యోగా గురువులు అన్నారు. స్థానిక హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్, యోగా సెంటర్ గురువు డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమానికి బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా సభ్యుడు నల్లా పవన్‌కుమార్ అతిథిగా పాల్గొన్నారు. అనంతరం యోగా గురువు డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యోగా శిక్షణా కార్యక్రమం జరిగింది. సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. స్థానిక సుబ్బారాయుడి చెరువు వద్ద మున్సిపల్ చిల్డ్రన్ పార్కుకు ఉదయాన్నే వాకింగ్‌కు వచ్చే వాకర్స్ కలిసి యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా వాకర్లు కూడా యోగాసనాలు వేశారు. స్థానిక నారాయణపేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం జరిగింది. వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్ఎస్ పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు వాకర్స్ కోఆర్డినేటర్ పచ్చిగోళ్ల శ్రీనివాసరావు అతిథిగా పాల్గొన్నారు. యోగా గురువులు వేదనభట్ల సాయిలక్ష్మి, డాక్టర్ రాయుడు మానస యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం బీవీఎస్‌సీ పోలిశెట్టి, వాకర్స్ క్లబ్ కార్యదర్శి వై.అనంతలక్ష్మి, రచయిత పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అధ్యక్షతన స్థానిక చల్లావారి వీధిలో యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి. యోగా గురువు కొప్పిశెట్టి నాగేశ్వరరావు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. సీనియర్ సిటిజన్లు, యువతీ యువకులు యోగాసనాలు వేశారు.



ముమ్మిడివరంలో యోగాసనం వేసిన జూనియర్ సివిల్ జడ్జి రహ్మతుల్లా తదితరులు



సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో యోగాసనాలు



అమలాపురంలో హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్, యోగా సెంటరులో యోగాసనాలు వేస్తున్న సాధకులు



భట్లపాలెం బీవీసీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



చెయ్యేరు జెడ్పీ స్కూల్‌లో యోగా సాధన చేస్తున్న చిన్నారులు



ఎస్.యానం జెడ్పీ హైస్కూల్‌లో యోగాపై అవగాహన కల్పిస్తున్న వరప్రసాద్

యోగాతో మానసిక ప్రశాంతత
– జూనియర్ సివిల్ జడ్జి రహ్మతుల్లా

ముమ్మిడివరం: ప్రస్తుత యాంత్రిక యుగంలో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఎంతో ఉపయోగా పడుతుందని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహ్మతుల్లా అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అవరణలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వం పొందాలంటే యోగా ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ప్రతి నెలా మూడో శనివారం క్రమం తప్పకుండా యోగా, మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. యోగా సౌండ్ హీలింగ్ శరీరం సహజ విధానాలను ప్రేరేపించి, ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, వెన్నునొప్పి, నిద్రలేమి వంటి వాటికి ఉపశమనం కల్పిస్తుందని హెల్తీ లైఫ్ జిమ్ యోగా గురువు వాసంశెట్టి నరేష్ వివరించారు.

యోగాతో ఆరోగ్య రక్షణ: డీఎంహెచ్‌ఓ

ఉప్పలగుప్తం: యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డీఎంహెచ్‌ఓ భరతలక్ష్మి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో వైద్య సిబ్బంది శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్.యానం, ఎస్.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో యానాం ఆరోగ్య విస్తరణాధికారి విప్పర్తి వరప్రసాదరావు యోగాసనాలు వేసి, అవగాహన కల్పించారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎల్.రాణి, బి.అప్పారావు, బి.రామకృష్ణ, వేదాంత ఈఈ పాషా, వైద్యాధికారి లోవసుధ, బీర బాలరాజు, పీడీలు గొలకోటి ఫణీంద్ర, డి.సరస్వతి పాల్గొన్నారు.

వివిధ కళాశాలల్లో..

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా, ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురువు తిలక్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా ప్రాముఖ్యాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు మాట్లాడుతూ విద్యార్థులు యోగా ద్వారా ఆరోగ్యంతో పాటు, మానసికోల్లాసం, ఆధ్యాత్మికతను అలవర్చుకోవచ్చని వివరించారు. కామనగరువు ఆదిత్య స్కూల్‌లో యోగా దినోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ రామప్రసాద్ అధ్యక్షతన జరిగాయి. విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. ఎస్‌కేబీఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కుమారశాస్త్రి అధ్యక్షతన కళాశాలలో జిల్లా సంస్కార భారతి ప్రముఖ్, విశ్రాంత హెచ్‌ఎం కళాపూర్ణారావు యోగా పద్ధతులపై వివరించారు. ఎన్‌సీసీ విద్యార్థులతో ఆర్మీ అధికారి కెప్టెన్ ఏవీ శర్మ యోగాసనాలు వేయించారు.

విద్యార్థులతో యోగా సాధన

కాట్రేనికోన: ప్రపంచ యోగా దినోత్సవాన్ని చెయ్యేరు జెడ్పీ హైస్కూలు, శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల, అంగన్‌వాడీ కేంద్రాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల సెక్రటరీ డీవీఎస్ఎన్ వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యోగా గురువు గండికోట శ్రీనివాస్ విద్యార్థులతో సాధన చేయించారు. చెయ్యేరు స్కూలు హెచ్‌ఎం శేషసాయి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తులసి, ఎల్‌వీ రమణి ఆధ్వర్యంలో కాట్రేనికోన, పల్లంకుర్రు, కందికుప్ప, దొంతికుర్రు సెక్టార్ల పరిధిలో చిన్నారులతో యోగా సాధన చేయించారు.

ప్రముఖ యోగా గురువుకు సత్కారం



యోగా గురువు భైరవస్వామిని సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి సేవా రత్న అవార్డు గ్రహీత, 90 ఏళ్ల యోగా గురువు మోటూరి భైరవస్వామిని వాకర్స్ హెల్త్ క్లబ్ శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించింది. అయినవిల్లి మండలం నల్లచెరువు గ్రామంలోని తన ఇంట్లో వృద్ధాప్యంతో విశ్రాంతి తీసుకుంటున్న భైరవస్వామి వద్దకు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో వాకర్స్ బృందం వెళ్లి ఆయనను ఘనంగా సత్కరించారు. వేలాది మందికి యోగా శిక్షణ ఇచ్చిన భైరవస్వామిని యోగా దినోత్సవం వేళ సత్కరించడం తమ అదృష్టమని క్లబ్ అధ్యక్షుడు సత్య వరప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, క్లబ్ జిల్లా ఎలెక్ట్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి వలవల నాయుడు, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, క్లబ్ ప్రతినిధులు తేతల సత్యనారాయణ రెడ్డి, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌కు ఉత్తమ సేవా పురస్కారం



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు



ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్

అమలాపురం రూరల్: ఎన్నికల నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వహించిన డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావుకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మధుసూదనరావు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదనరావు విలేకరులతో మాట్లాడుతూ, గత సాధారణ ఎన్నికల్లో ఈవీఎంల జిల్లా నోడల్ అధికారిగా, అలాగే సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ ప్రిపరేషన్ జిల్లా నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించినట్టు తెలిపారు.

ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు ప్రశంసలు

అల్లవరం: సార్వత్రిక ఎన్నికల్లో ఎంసీసీ విభాగంలో ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించినందున అల్లవరం ఎంపీడీఓ బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్ ప్రశంసలు అందుకున్నారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. పలువురు ఆయనను అభినందించారు.

కార్యకర్తలకు అండగా నిలబడదాం..

మాజీ ఎంపీ అనురాధ



ఎంపీటీసీలతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ అనురాధ

అల్లవరం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కోసం అహర్నిశలూ శ్రమించిన కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎంపీ చింతా అనురాధ అన్నారు. మొగళ్లమూరులోని ఆమె నివాసంలో శుక్రవారం ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమాలు ఇచ్చినా ప్రజలు ఆదరించలేదన్నారు. ప్రజల తీర్పును అందరూ గౌరవించాలన్నారు. పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలు, నాయకులకు తానెప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అందరూ కలసికట్టుగా ప్రజా సంక్షేమం కోసం పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలకు అమలు చేయాలని కోరుతున్నామని, ఒకవేళ సంక్షేమ పథకాల్లో కోత విధిస్తే లబ్ధిదారులకు అండగా పోరాటం చేస్తామని చెప్పారు. మండలాల వారీగా సమీక్షలు నిర్వహించి, పార్టీ బలోపేతానికి కార్యాచరణ చేస్తామన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పులుసుగంటి రాజేశ్వరి, గుబ్బల రంగనాథస్వామి, బస్వాని పద్మ, మాకే కృష్ణమూర్తి, పార్టీ నాయకులు దొమ్మేటి సురేష్, కర్రి శ్రీను, పులుసుగంటి ప్రసాదరావు, బస్వాని రాజు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం పలు పాఠశాలల్లో జరిగింది. పటవల హైస్కూల్‌లో హెచ్‌ఎం కాశీ విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే పి.మల్లవరం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం పీవీ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచ్ దున్నా సత్యనారాయణ తదితరులు విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

ఆర్‌ఎంపీపై ఇనుప రాడ్లతో దాడి

ముమ్మిడివరం: భూ వివాదం నేపథ్యంలో ఆర్‌ఎంపీ, టీడీపీ కార్యకర్త దొంగ సత్యనారాయణపై కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్టు కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం, మండలంలోని కొమానపల్లి పంచాయతీ కొత్తకాలువకు చెందిన ఆర్‌ఎంపీ దొంగ సత్యనారాయణకు, కొప్పిశెట్టి వెంకటేష్(బాబి)కి మధ్య భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి సత్యనారాయణ ఇంటికి తిరిగొస్తుండగా, కొత్తకాలువ సమీపంలో కొప్పిశెట్టి వెంకటేష్, మరి కొందరు ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ క్రమంలో అక్కడి నుంచి తప్పించుకుని ప్రాణం దక్కించుకున్నట్టు సత్యనారాయణ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు.

GENERAL PUBLICATION
SCHEDULE
MEASUREMENTS AND BOUNDARIES
TANTRAVAHI SUBBA RAO B.Sc., B.L.
R.Y.C. SUBBA RAO B.Sc., B.L., ADVOCATES

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
యానాం శాఖ, యానాం, పుదుచ్చేరి జిల్లా
డిమాండ్ నోటీసు (సంక్షిప్త)
(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు)
1) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా : మాగాపు అనిత, తండ్రి సుబ్బారావు, డో.నెం. 10-7-105, కోన వారి వీధి, కనకాల పేట, యానాం, పుదుచ్చేరి జిల్లా
శ్రీ మాగాపు సుబ్బారావు, తండ్రి అప్పారావు, డో.నెం. 10-7-105, కోన వారి వీధి, కనకాల పేట, యానాం, పుదుచ్చేరి జిల్లా
గ్యారంటార్ : శ్రీ మాగాపు అప్పారావు, S/o. సుబ్బారావు, డో.నెం. 3-55, సుంకరపాలెం, తాళ్ళరేవు మండలం, తూర్పుగోదావరి జిల్లా
2) లోన్ రకం మరియు అకౌంట్ నంబరు : ఎడ్యుకేషనల్ లోన్ అకౌంట్ నెం. 34035925424
3) ఋణ బకాయి మొత్తం : 12-06-2024 నాటికి రూ.4,72,726/- (నాలుగు లక్షల డెబ్బై రెండు వేల ఏడు వందల ఇరవై ఆరు రూపాయలు మాత్రమే) మరియు పైన తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటు వంతున భవిష్యత్ వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు మొ॥వి.
4) డిమాండ్ నోటీసు తేది : 12-06-2024, NPA తేది : 09-06-2024
5) ఆస్తి షెడ్యూలు : పుదుచ్చేరి రాష్ట్రం మరియు జిల్లా, పుదుచ్చేరి జిల్లా రిజిస్ట్రార్ ఏరియా యానాం ఎస్ఆర్ఓ, యానాం మున్సిపల్ ఏరియా, యానాం శివారు వద్ద, కోన వీధి, కనకాలపేట, యానాం వద్ద గల పట్టా నెం. 224, టి.ఎస్.నెం.సి/4/11, ఆర్.ఎస్.నెం.8/9 పిటి, సి.ఎస్.నెం.నిల్, విస్తీర్ణం H.00-A.01-Ca.50 (అనగా 150 చ.మీటర్లు) మరియు ఆర్‌సిసి గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు భవనం.
సరిహద్దులు : తూర్పు : రోడ్డు ; దక్షిణం : రోడ్డు; పశ్చిమం : వంగా సీతారామయ్య ఆస్తి, ఉత్తరం : కోన సత్యనారాయణ ఆస్తి
పైన తెలిపిన ఋణగ్రహీత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యానాం శాఖ, యానాం, పుదుచ్చేరి నుండి లోన్/ఋణ సౌకర్యాలు పొందారు. సదరు లోన్/ఋణ సదుపాయం సంబంధిత ఋణగ్రహీత పేరున తెలిపిన ఆస్తి మరియు ఆసెట్ తనఖా ద్వారా సెక్యూర్ చేయబడింది. సదరు ఋణగ్రహీత మంజూరు నియమ నిబంధనలను పాటించుటలో విఫలమైనందున, ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం సదరు ఖాతా సక్రమంగా లేనిదిగా మరియు ఎన్‌పిఎగా వర్గీకరించబడింది. మీచే తనఖా పెట్టబడిన సెక్యూరిటీలను జప్తు చేయడానికి బ్యాంక్ ఉద్దేశిస్తోంది మరియు రిజిస్టర్డ్ పోస్ట్ విత్ ఎక్నాలెడ్జ్‌మెంట్ డ్యూ తో డిమాండ్ నోటీసు జారీ చేసింది. అవి ఋణగ్రహీత యొక్క సరియైన సంతకం లేకుండా తిరిగివచ్చాయి. అందువలన ఈ నోటీసు జారీ చేయడమైనది.
ఇందుమూలంగా, పైన తెలిపిన మొత్తంతో పాటు కాంట్రాక్టు రేటు వంతున దానిపై వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మొదలైనవి ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించాలని ఋణగ్రహీతలను కోరడమైనది. లేనిచో బ్యాంక్ బకాయిలను రాబట్టుకోవడానికి సదరు చట్టం క్రింద చర్య చేపట్టడానికి దిగువ సంతకందారు తప్పనిసరి అవుతుంది.
తేది : 21-06-2024
ప్రదేశం : యానాం
సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా